# ఆబోతు

ఆ వూరు మళ్ళీ వెడతా ననుకోలేదు. వెళ్ళాల్సి వచ్చింది, ఎలక్షన్ డ్యూటీ మీద. తప్పించుకుందామని ప్రయత్నించాను. భార్యకు రక్తపోటు అని అబద్ధమాడాను. నే లేకపోతే ఆమె బాగోగులుచూచే దిక్కులేదని మొర పెట్టుకున్నాను. రికమెండేషనూ చేయించాను.

ఫలించలేదు. "పంచాయితీ ఎలక్షన్లు—ఆఫీసర్లు చాలామంది కావాలి. కనుక వీల్లేదు" అన్నారు అధికారులు.

మనసులో దేవుడికి శతకోటి నమస్కారాలర్పించుకుని, బ్రతికి బయట పడితే కొబ్బరికాయ కొడతానని ఆశకూడ పెట్టాను. ఆ పైన భారమంతా దేవుడిమీద వేసి ఎలక్షను డ్యూటీకి బయలుదేరాను.

మమ్మల్నందర్నీ ఒక లారీలో ఎక్కించి, తీసుకెళ్ళి ఎవరి డ్యూటీ ఉన్న చోట వాళ్ళను దింపారు. నే దిగేసరికి మా అనుచరులతోటి అర్ధరాత్రి దాటింది.

చీకటి రోజులు! వూర్లో ఇళ్ళన్నీ నిద్రపోతున్నాయి. కుక్కల అరుపులు తప్ప చప్పుడు లేదెక్కడా!

అందరం రేకులషెడ్ లాంటి ఇంట్లో ప్రవేశించాం. లాంతర్లు పెట్టుకుని, పోలీస్‌పటేల్ మాకోసం ఎదురుచూస్తున్నాడు

భోజనం లేదు. మంచినీళ్ళు త్రాగి బల్లలమీద నడుం వాల్చాం. నా తల క్రింద బ్యాలట్ పేపర్లు, ప్రక్కన బ్యాలట్ బాక్సులు. నిద్రరాలా, సిగరెట్ కాలుస్తూ పడుకున్నా.

ఇక్కడ—ఈ వూర్లో రెండురోజులు ఉండాలి. ఉన్న రెండురోజుల్లో భామా రెడ్డి కంటపడకుండా ఉండగలిగితే చాలు! అదే నా ప్రార్థనా, భయంగూడా.

అసలా భూమారెడ్డికి భయపడే ఎలక్షను డ్యూటీ మానుకోవా లనుకుంది. అయినా విధి తప్పలేదు. ఏమయితే అదవుతుందని, మనస్సు రాయిచేసుకున్నాను. అయినా తొలికోడి కూసేదాకా నిద్రరాలా!

నాకు మెలకువ వచ్చేసరికి సూర్యుడు బారెడుసాగేడు. మా మిత్రులప్పటికే వూరంతా ఒకచుట్టు తిరిగొచ్చి, "గురూ! ఇక్కడ టీ దుకాణం లేదు. కాఫీ దొరకదు. అన్నంపెట్టే నాథుడు లేడు" అని తలా ఒకచోట జారగిలబడ్డారు.

ఆ సంగతి నాకు తెలుసు. ఇది వూరు అయినా ఇక్కడేమీ దొరకదు. వూరినిండా గుడిసెలు, పిచ్చితుమ్మచెట్లు, వూరికి ఒక మైలు దూరాన చెరువు ఉంది. త్రాగటానికి కూడా నీళ్ళు అక్కడ నించే తెచ్చుకోవాలి. ఆ చెరువు కింద కొంత పొలంలో వరి పండుతుంది. ఇక మిగతా పొలమంతా జొన్నా, లేదా అముదాలు వెయ్యాల్సిందే. ఆ వూరి పొలంతో ఎక్కువ భాగం భామారెడ్డిదే. వూర్లో ఉన్న మేడ ఒక్కటీ ఆయనదే! ఆ మేడలోనే బోరింగు పంపు ఉంది! నాగరికత కూడా అక్కడే ఉంది. ఇవన్నీ తెలుసు నాకు! అయినా చెప్పలేదు. భామారెడ్డి ఇంటికి పోవటం నా కిష్టం లేదు!

ఆ రోజునే స్కూలు దాటి బయటకు పోలేదు, పోలీసుపటేలు మాకందరికీ అన్నాలు వండించి పెట్టాడు. 'చా' కాఫీ పోయించాడు.

పగలు ఎలక్షను ఏర్పాట్లు చేశాం. దడులు కట్టడం, బ్యాలట్ పేపర్ల మీద సంతకాలు, ముద్రలు వగైరా పనులు చేశాం, మాకు తోడు పోలీసుపటేలు, ఇద్దరు పోలీసులు, వెట్టివాళ్ళు అంతే!

ఆ సాయంత్రం పోలీసుపటేలు నన్ను పరీక్షగాచూసి, "సార్! మీరింతకు ముందు ఈడున్నారా?" అని అడిగాడు.

ఇదివరకు ఈ వూర్లో ఉన్నప్పుడు లేని మీసాలు ఇప్పుడున్నాయి. అందుకని అతడు గుర్తుపట్టలేదు.

మళ్ళీ అడిగాడు పోలీసుపటేలు-"మీలాగే ఉండేవాడు, సార్, ఒకపంతులు అయన మీకేమనా అవుతాడేమోనని?" అన్నాడు.

నే సమాధానం చెప్పలేదు. నవ్వాను.

ఆ మర్రోజు పోలింగ్.

ఆ వూళ్లో ముటాలు, పార్టీలు లేవు. అందువల్ల హడావుడీ అంతగా లేదు. ఎవరో నిలబడ్డారు. వోటర్లు నింపాదిగా వచ్చి వోట్లేస్తున్నారు.

మధ్యాహ్నం దాటాక సుజాత వచ్చింది. బ్యాలట్ పేపర్ తీసుకునేప్పుడు నన్ను చూసింది. చూసి, చిన్నగా నవ్వి 'బాగున్నారా' అనడిగింది. అంతే. వోటేసి వెళ్ళిపోయింది.

సుజాత కొద్దిగా లావైంది. ఆరిందాతనమూ వచ్చింది.

"అబ్బ! ఏం బ్యూటీ, గురూ! ఈ అడవిలో ఇంతటి చక్కనిచుక్క ఉండటం ఆశ్చర్యమేసుమా!" అన్నాడు నా తోటి పోలింగు ఆఫీసరు, కళ్ళింత చేసుకుని ఆశ్చర్యంగా—రహస్యంగా!

"భూమారెడ్డిభార్య" అన్నాడు పోలీసుపటేలు. మా మాటలువినే అన్నాడో లేక మా ఆశ్చర్యం గమనించే అన్నాడో తెలియదు.

"ఎవరా భూమారెడ్డి?" మావాడొకడు ప్రశ్న వేశాడు.

"ఓటెయ్యటానికి వచ్చాడా?" అని మరొకడు అడిగాడు.

"రాలేదు, సార్!"

"ఏమో?"

"పచ్చవాతం! పైగా కళ్ళు కనబడవు."

మా వాళ్ళకు మరీ ఆశ్చర్యం వేసింది. ఓటర్లూ అంతగాలేరు. అందుకని చర్చ భూమారెడ్డి మీదకు మళ్ళింది.

"భూమారెడ్డని పెద్ద జాగీర్దారు, సార్! బాగా ముసలోడు లెండి—ఆయన భార్య ఈమె!" అన్నాడు పోలీసుపటేలు" ఆ తరువాత మరి నోరు విప్పలేదు.

నా తోటివాళ్ళకు అంతా గమ్మత్తుగా ఉంది. ఏవేవో ప్రశ్న లేశారు.

"ఈవిడ ఆయన్ను ఎందుకు చేసుకుందీ!"

"బలవంతపు పెళ్ళా!"

"ఆ ముసలోణ్ణి ఇంకా ఈవిడ ఎందుకు వదల్లేదు!"

"ఆమె క్యారెక్టర్ మంచిదేనా?"

"తార, బృహస్పతుల కథలా ఉందే?"

"పిల్లలున్నారా?''

"ఆస్తి కోసమే చేసుకుందా?"

ఇలా, ఇలా!

పోలీసుపటేలు వీళ్ళ ప్రశ్నలకు సమాధానం చెప్పలేదు. తెలిసేచెప్పలేదో, తెలియక చెప్పలేదో!

ఎలక్షను పూర్తయింది. ఫలితాలు ప్రకటించడం పూర్తయింది. అందరం సామాన్లు సర్దుకుని లారీకోసం ఎదురు చూస్తున్నాం.

అదిగో-అప్పుడు కబురొచ్చింది-భూమారెడ్డి మేడనుంచి, "రాత్రికి ఎలక్ష నోళ్ళ కంతా భోజనాలు ఏర్పాటుచేస్తున్నా రమ్మగా"రని.

నా తోటి వాళ్ళంతా ఎగిరిగంతేశారు-మంచిభోజనం తినొచ్చనీ, మరోసారి ఆమెను చూడొచ్చనీ!

నా కిష్టం లేదు అక్కడకు పోవడం.

"ఏటి, గురూ! అలా డిపాజిట్ పోయినవాడిలా ఉన్నావు" అన్నారు తోటి వాళ్ళు.

ఏదో సాకు చెప్పి పోకూడదు అని తీర్మానించుకున్నాను.

పొద్దు గూకింది.

మనస్సులో గుబులుగా ఉంది నాకు. రాకూడని చోటు కొచ్చాను. వచ్చి చూడకూడదనుకున్న సుజాతను చూశాను. త్వరగా ఈ వూర్ని నుంచి వెళ్ళి పోతే క్షేమంగా—అంతే చాలు!

భూమారెడ్డికి పక్షవాతం, కళ్ళు కనబడక పోవటం నా మంచికేనేమో? ఆయనే సవ్యంగా ఉండి నే రావడం గమనిస్తే, ఇంకేముంది! నన్ను ఏ గోతి లోనో పాతిపెట్టేవాడు. లేదా నిలువునా కాల్చేసేవాడు. అది ఖాయం. అదే నా భయంకూడా.

లాంతర్లు తీసుకుని పాలేర్లు వచ్చారు అందరూ భోజనాలకు బయలుదేరారు. నన్ను రమ్మని బలవంతం చేశారు.

"నా కడుపులో బాగో లేదు. మీరు వెళ్ళండి" అని నచ్చచెప్పి పంపాను.

"రాండి, సారూ!" అని పోలీసుపటేలు బలవంతం చేశాడు.

పోలేదు. అందరూ వెళ్ళారు.

నే ఒక్కణ్ణి బల్లమీద పడుకుని, గతం జ్ఞాపకాల లోకి వెళ్ళాను.

వానాకాలం! అప్పుడే నాకు మేస్టరీ ఉద్యోగం వచ్చింది. అపాయింట్ మెంటు ఆర్డరు పట్టుకుని కొంతదూరం బస్సుమీద ప్రయాణంచేసి, ఆ తరవాత నడిచి పూరు చేరాను.

ఏకోపాధ్యాయుణ్ణి. సరాసరి బడిఅని పిలవబడే చోటుకు వెళ్ళాను. అక్కడ పాత బోర్డు తప్ప మరేంలేదు. ఒకపాక-దానికి తలుపులు లేవు. లోపలబల్లలు లేవు. బ్లాక్ బోర్డూ లేదు. ఒక రెండు గాడిదలు కాపుర ముంటున్నాయక్కడ. ఆ రాత్రి సూట్ కేసు తలకింద పెట్టుకుని పడుకున్నాను. రాక రాక వచ్చిన ఉద్యోగాన్ని తిట్టుకుంటూ.

తెల్లారాక ఒకరిద్దరు పలకరించి, నా సంగతి వాకబు చేశారు. అంతే!

ఆ వేళ పొద్దున్నే చెరువు కెళ్ళి కాలకృత్యాలు తీర్చుకుని, స్నానం చేసి వస్తుంటే, భూమారెడ్డి పొలం నుంచి వస్తూ చూశాడు.

ఆరడుగుల మనిషి మోకాళ్ళ కింద దాకా ఎర్రంచు పంచె—మోచేతి దిగువకున్న తెల్లచొక్కా కాలరులేనిది. చెవులకు పోగులు—కాళ్ళకు కిర్రు చెప్పులు. చేతిలో పొన్నుకర్ర. మఫ్టీలో ఉన్న యముడిలా కనుపించాడు.

"ఏ వూరు"

చెప్పాను.

''పెళ్ళయిందా?''

చెప్పాను.

నన్ను ఎగా దిగా చూసి వెళ్ళాడు. నేను స్కూలుకొచ్చి ఒకమనిషి చేత ఆవరణలంతా వూడ్పించాను. ఇక వూరి పెద్దల్ని కలుసుకుని, బడి ప్రారంభించాలని నిశ్చయించుకున్నాను.

భూమారెడ్డి పాలేరు మరచెంబుతో 'చా' తెచ్చి ఇచ్చాడు. పోతూ "భోజనం కూడా ఈడకే తెస్తానండీ" అని చెప్పి వెళ్ళాడు.

వూళ్ళో ఎక్కువభాగం లంబాడీలు. మిగతావాళ్ళు గౌండ్లవాళ్ళు రెక్కాడితే గానీ ఎవ్వరికీ డొక్కాడదు. పొయ్యిలో పిల్లి లేవదు. ఇక, బడి కెవరొస్తారు? పిల్లలు రాకపోతే, బడి సవ్యంగా నడవకపోతే, నా ఉద్యోగం ఏమవుతుంది? ఇవన్నీ ప్రశ్నలు!

ఆ సాయంత్రం పంచాయతీ సమితి ఆఫీసుకెళ్ళి నా మొర అధికార్లకు విన్నవించుకుందా మనుకున్నాను కానీ, వెళ్ళలేదు.

భూమారెడ్డి మేడనుంచి కబురొచ్చింది. వెళ్ళాను.

పెద్ద ఆవరణలో రెండంతస్తుల మేడ. ఆవరణలో శాబాదు రాళ్ళు పరచి ఉన్నాయి. ఒకమూల నడుం ఎత్తు పెరిగిన కొబ్బరిచెట్లు, దాని పక్కనే గొడ్ల పాక-ఆవులు, గేదెలు, గొర్రెలు చాలా ఉన్నాయి.

ఆసుబయట కొయ్యి పడకకుర్చీలో బాసీపెట్టు వేసుకుని చుట్ట కాలుస్తూ కూర్చున్నాడు భూమారెడ్డి. ఆయన పక్కన పాలేరు కింద కూర్చుని, గేదె దూడకు మేత పెడుతున్నాడు.

"పంతులూ! ఏడుంటావ్?"

నేనేం మాట్లాడలేదు.

"చూడు! ఈడ మీ బస్తోళ్ళు ఉండలేరు. ఈడేముంది? చదువెవరికి గావాల? గవుర్నమెంటోళ్ళ పిచ్చిగానీ! వేరే చోటుకు బదిలీ చేయించుకో!"

నా కంత స్తోమత లేదు అని చెప్పలేదు. తలొంచుకుని నిలబడ్డాను.

మేడలో దీపాలు వెలిగించారు. చీకటి పడ్డది.

"ఉంటవో, పోతవో తేల్సుకో! భోజనం ఈడనేచెయ్యి!"

భూమారెడ్డి హుకుం ప్రకారం మేడలో భోజనం, స్కూల్లో పడక!

నెలయింది వచ్చి! పదిమంది పిల్లల్ని పోగేశాను! నెల జీతం తెచ్చుకునేందుకు సమితి ఆఫీసు కెళ్ళినప్పుడు బి. డి. వో. కి నా పరిస్థితి చెప్పుకున్నా.

"అందరట్లంటే ఎట్లా? పని చెయ్యాల్సిందే పూళ్ళలో. చెయ్య లేనంటావ్ ఉద్యోగం మానుకో!" అదీ ఆయనిచ్చిన సలహా

తిరిగొచ్చాను. నాతోపాటే తుఫానొచ్చింది. వారం రోజులు వానా గాలీ! వూళ్లో గుడిసెల తలలు ఎగిరిపోయాయి. మా బడి కప్పు ఎగిరిపోయింది. గోడలు వానకు నాని, పడిపోయాయి.

నా నివాసం మేడలోకి మారింది.

భోజనానికి వెళ్లిన నా తోటివాళ్లు తిరిగొచ్చారు.

"గురూ! మంచి భోజనం మిస్సయ్యావు!"

"ఎంతో ఆశతో వెళ్ళామా? అబ్బే ఆ రంభ కనపడలేదు"

ఇలా చెప్పుకున్నారు భోజనం చేసి వచ్చిన వాళ్ళు:

"మిమ్మల్ని టిఫినీ తిందురు గానీ రమ్మన్నారు" ఎనుబోతంత పాలేరు ఒక చేత్తో లాంతరు, మరో చేత్తో బాణాకర్ర పుచ్చుకుని యమభటుళ్ళా నిలబడ్డాడు.

"వెళ్లండి, సారూ! బాగుండదు. ఆ యమ్మకు కోపం వస్తది" పోలీసు పటేలు బలవంతం చేశాడు.

వెళ్ళక తప్పలేదు, వెళ్ళాను తల వంచుకుని!

ఆరుబయట వరండా పక్కగా బల్లమీద మొదలు నరికిన చెట్టులా భూమా రెడ్డి పడుకోనున్నాడు. నోట్లోంచి చొంగ కారుతుంది. ఒంటి మీద గుడ్డకూడ సరీగ్గా లేదు.

సుజాత నా కోసమే గడప దగ్గర కూర్చోనుంది.

కాళ్ళు కడుక్కుని, లోపలకెళ్ళాను. నా వెనకే వచ్చింది. సుజాత దీపం తీసుకుని.

"స్పెషల్‌గా పిలవాలా?'' అంది. అది నిష్ఠూరమో. అభిమానమో తెలియదు.

తలొంచుకుని కూర్చున్నా, సుజాతను చూడాలని మనస్సు పీకుతున్నా.

వెండి కంచంలో భోజనం పెట్టి, ఎదురుగానే కూర్చుంది సుజాత!

తలొంచుకునే కోడి కెలికినట్లు అన్నం తింటున్నా.

''బాబు పబ్లీకు ఇస్కూల్‌లో చదువుతున్నాడు హైదరాబాద్‌లో''

''నువ్వుండే జాడ తెలియదు!''

''సిన్మాలు సూట్టానికి పట్నం వ స్తె' లాడ్జిలోనే ఉంటా!''

సుజాత అప్పుడోమాట, ఇప్పుడో మాటచెబుతూ వడ్డిస్తున్నది.

నే మాట్లాడలేదు. ఏమనుకుందో ఏమో, పెరుగు గిన్నె దభేల్మని టేబుల్ మీద పెట్టి, "ఏం దా పెడసరితనం! నే చెప్పేది నీకే" అంది కోపంగా!

తలెత్తి చూశాను. ఆమె కళ్ళలో నీళ్ళు ఉన్నాయి. ముఖం జేవురించింది. ఎర్రటి ముక్కుపుడక తళుక్కుమంది. చీర బుజాలమీద కప్పుకుని, 'ఏమైంది నీకు? అట్లాగయినావు" అని రెట్టించింది.

"మీ ఇంటికి రావాలంటే భయం!'' అన్నాను.

సుజాత ఫక్కున నవ్వింది. నవ్వి దగ్గరగా వచ్చి, వీపు చేత్తో రాసి, "అందుకనా అట్లున్నావు!'' అని, ''మా సవితి పాము కరిచి చచ్చింది. ఇక ఇంటాయన అట్లా అయినాడు—ఇంక దేనికి భయం!'' అంది.

''నీవు మహారాణి వయ్యావని తెలియదు''

చెయ్యి కడుక్కుని చెప్పులు తొడుక్కున్నా.

''ఉండరాదా! శానాదినాలకు అగుపడితివి''

''లేదు—వెళ్ళాలి. వెళ్ళకపోతే నా తోటి వాళ్ళు అనుమాన పడతారు.''

''మరి పట్నమొస్తే అగుపడతవా?''

అడ్రసిచ్చాను.

సుజాత బాబు ఫోటోచూపించి, "ఎట్లున్నడు" అనడిగింది కుతూహలంగా

బాబువి పెద్ద కళ్ళు. తండ్రిలా ఆజానుబాహు వవుతాడు పైగా కలవారి బిడ్డ! రాజాలా ఉన్నాడు. ఆ మాటే చెప్పాను.

సుజాత పొంగిపోయింది నా మాటలకు. ''నువ్వు సిక్కినావు. మీ ఆడది

తిండెట్టటం లేదా? జర మంచిగ తిను. పిల్ల లెందరూ?'' అనడిగింది.

''ఇద్ద రాడపిల్లలు!''

"గట్టనా! మరి గందుకే దిగులుతో గట్లయినావు! సర్లె, ఉండు.'' సుజాత లోపలికెళ్ళింది. తిరిగొచ్చి, పట్టురుమాలుతో కట్టిన మూట ఇచ్చి, ''గిది తీస్కపో. భద్రం! సూడు, మీ పట్నమెళ్లినాకనే ఆ మూట సూచుకో! లేకపోతే ఒట్టు'' అంది నవ్వుతూ.

వచ్చేశాను. మూట ఏమిటని ఎవరన్నా అడిగితే ఏం చెప్పాలి? అందుకని లాల్చీజేబులో దాచుకుని స్కూలు కెళ్లంగానే బెడ్డింగులో దాచేశా.

తెల్లవారుఝాముదాకా లారీ రాలేదు. దోమలు నిద్రపట్ట నివ్వలేదు.

సుజాత ఏమిచ్చింది? స్వీట్లా? ఏమో? మళ్లీ మనసు గతంలోకి వెళ్లింది.

భూమారెడ్డి ఇంట్లో గాలివాన వెళ్ళాకగూడా నా మకాం మారలేదు. ఎందుకంటే....

భూమారెడ్డికి ఇద్దరు భార్యలు. పెద్ద భార్యకు పిల్లలు లేరు. అందుకని పెద్ద భార్యే మొగుడికి మరో పెళ్ళి చేసింది. అయినా పిల్లలు పుట్టలా! సుజాత భూమారెడ్డి భార్యగా ఆ మేడలో ఉండటం అది రెండో ఏడు. ఇంటి పెత్తనం అంతా భూమారెడ్డి పెద్ద భార్యదే. ఆమె నా అకారం, తీరు తెన్ను, మాట మంచితనం చూసి ''నువ్వు పట్నపోడివైనా మంచోడివి!'' అంది.

ఆ తర్వాత నాకు ఆ ఇంట్లో రాజమర్యాదలు జరిగాయి. పండుగకు, పబ్బాలకు క్రొత్త గుడ్డలు పెట్టడం గాక, తిండీ తిప్పలు, అన్నీ ఉచితం. పేరుకు పంతుల్ని. బడి లేదు. పిల్లలు లేరు.

అర్నెల్లు గడిచాయి. నామీద భూమారెడ్డికి నమ్మకం కుదిరింది. డబ్బు, కాగితాలు, దస్తావేజులు, వెండి బంగారం.... అన్ని నాచేత లెక్కలు చూపించుకునేవాడు.

చలువ పందిరి నీడలో కాపురం. రాజ భోజనం. దిగులూ, చింతాలేని బ్రతుకు. భూమారెడ్డి, ఆయన పెద్ద భార్య పెళ్ళిళ్ళకు, పుణ్యక్షేత్రాలకు వెళుతూ ఇంటిబాధ్యత నా కప్పగించేవారు. అంత నమ్మకం, గురి నామీద.

లంకలాంటి మేడలో నేను, సుజాత!

"డబ్బు దస్కం తీసుకుని పారిపోదాం" అన్నాను సుజాతతో! ఆమె ఒప్పుకోలేదు. నాతో చనువు తగ్గించింది ఆ తర్వాత. కనబడటం కూడా మానేసింది.

భూమారెడ్డి పెద్ద భార్య శాయమ్మ ఒక రాత్రి నా గది కొచ్చింది. వచ్చి, "పంతులూ! చేసిన నిర్వాకం చాలు! ఎల్లిపో! ఆయనకు అనుమానం కలిగితే, నీకు సమాధి కడతాడు. నమ్మినందుకు దాని బతుకు నాశనం సేశావ్! ఎల్లు, మార్యాదగా! సూడు, మల్లీ రా కీ చాయలకు! ఆఁ!" అని వార్నింగ్ ఇచ్చింది.

అంతే. ఆ పోవటం ఇదే రావటం మళ్ళీ.

లారీ మీద పట్నం చేరాము. టి.ఎ.లు, డి.ఎ.లు తీసుకుని ఇంటికెళ్ళి తలుపేసుకుని సుజాత ఇచ్చిన పట్టు రుమాలు తెరిచాను.

పదివేల రూపాయలు! నాలుగు బంగారుగాజులూ ఉన్నాయి!

సుజాత దేనికిచ్చింది! సుజాత నే నిచ్చిన తప్పుడు అడ్రెసు ఎందుకు తీసుకుంది? అన్నీ ప్రశ్నలే!

ఆ ప్రశ్నలకు సమాధానం చాలా రోజులదాకా దొరకలేదు.

ఒక రోజు మా ఎదురింట్లో అవులతో ఉన్న ఆబోతును వెళ్ళగొడుతుంటే, నా కెందుకో అనిపించింది—నేనూ, ఆబోతూ ఒకటేనేమో అని. ★

---

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక—6-1-1982)